ప్రజాశక్తి

సోమవారం 22 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అదానికి కొండ..ఉపాధికి ఏదీ అండ...

- డేటా సెంటర్‌కు ఒకటి ?
  గూగుల్‌కు మరో కొండ
- పర్యావరణ అంశాలపై స్పష్టత లేని కూటమి పాలన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని ప్రకృతిసిద్ధమైన కొండలను అదాని, గూగుల్ వంటి కార్పొరేట్ సంస్థలు తన్నుకుపోతున్నారు. అందుకు తగ్గట్టుగా కూటమి సర్కారు పక్కా ప్రణాళిక వేసిందనే చెప్పాలి. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు 2024లో అధికారం చేపట్టాక (ఈనెల 22న రాకతో కలిపితే) మొత్తం 4 దఫాలు విశాఖకు వచ్చారు. ఇలా వచ్చినప్పుడుల్లా విశాఖలో ఒకవైపు విశాలమైన సముద్రం, మరోవైపు అందమైన కొండలు' అంటూ పెట్టుబడిదారులను ఊరిస్తున్న సంగతి తెలిసిందే. 2024లో అధికారం చేపట్టాక అదాని డేటా సెంటర్‌కు నగరంలోని మధురవాడ పరిధిలోగల రుషికొండ (పనోరమ హిల్స్ వద్ద 276 ఎకరాలను) నేరుగా చంద్రబాబు ప్రభుత్వం రాసిచ్చేసింది. ఈ భూమి చుట్టూ అదాని కంపెనీ పెన్సింగ్ వేసెయ్యడం అందరి దృష్టి అటు పడింది. ఏళ్లు గడుస్తున్నా డేటా సెంటర్ కోసం ఇక్కడ అదాని కంపెనీ పిడికెడు మట్టి ఎత్తిపోయ్యలేదు. మరోవైపు ఆనందపురం మండలం తర్లువాడ కొండ చుట్టూ 300 ఎకరాల కోసం అధికార పార్టీ పెద్దలు పెద్ద స్కెచ్ వేశారు. గూగుల్ సంస్థ వచ్చేస్తుందంటూ ఇక్కడ సాగులో ఉన్న దళితులను వెళ్లగొట్టేందుకు రంగం సిద్ధం చేశారు.

కాపులుప్పాడలో గతంలో ఒక కొండ...

2014-2019 మధ్య చంద్రబాబు హయాంలోనే డేటా సెంటర్‌కు మధురవాడ (కాపులుప్పాడ) కొండ సమీపంలో 130 ఎకరాలను అదానికి కేటాయించారు. ఇక్కడ డేటా సెంటర్లు, ఐటి పార్క్, నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయం కోసం చంద్రబాబు సర్కారు ఎపిఐఐసి ద్వారా మౌలిక వసతుల కోసం రూ.కోట్లు ఖర్చుచేయించింది. ఈ ప్రాజెక్టు కోసం అప్పట్లో రూ.21వేల కోట్లు ఖర్చుచేయనున్నట్లు, దీన్ని అదాని కనెక్స్ సంస్థ అభివృద్ధి చేయబోతుందంటూ చంద్రబాబు ప్రచారం చేశారు. తొలుత 200 మెగావాట్లతో డేటా సెంటర్ అన్నారు. తర్వాత 100 మెగావాట్ల డేటా సెంటర్‌కు కుదించేశారు.

2019లో ఏం జరిగింది?

ఈ డేటా సెంటర్ అనుమతులను 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక రద్దు చేసి కొత్త ఒప్పందం చేసుకుంది. దీనికి ముందే అదానికి ఈ స్థలం గిట్టుబాటు గాక లీజు ఒప్పందం నుంచి వెనక్కి వచ్చాడు. రాష్ట్ర ప్రభుత్వంపై అదాని ఒత్తిడితో లీజు రద్దు చేసి సేల్ డీడ్ రాసుకున్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు మినహాయించారు. ఇదే ప్రస్తుతం మధురవాడ సర్వే (పనోరమ హిల్స్) నెంబరు 409/ నుంచి 427 నెంబరు వరకూ ఈ భూమి 276 ఎకరాలు కొండ చుట్టూ విస్తరించి ఉంది. దీనికి అదాని కంపెనీ 'వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్' అని స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పివి) ఏర్పాటు చేసుకున్నాడు. ఈ భూమి కేటాయింపులో గతంలో జగన్ సర్కారు, తాజాగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి దొందూ దొందుగానే వ్యవహరించాయి. వాస్తవానికి గతంలోనే 24వేల ఉద్యోగాలు ఇస్తామని అదాని కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. తాజాగా

మిగతా 2లో..

నేటి నుంచి ఈ గవర్నెన్స్ సదస్సు

- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదులు విభాగం (డిఎఆర్‌పిజి), ఎలక్ట్రానిక్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 28వ జాతీయ ఈ - గవర్నెన్స్ సదస్సును ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్ వేదికగా నిర్వహిస్తున్నామని డిఎఆర్‌పిజి కార్యదర్శి వి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సాయంత్రం నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ సదస్సులో ప్రధానంగా ఆరు ప్లీనరీల్లో 12 అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరుగుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 1020 మంది ఆహ్వానితులు పాల్గొంటారని చెప్పారు. ఈ సదస్సును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 19 కార్యక్రమాలకు జాతీయ ఈ గవర్నెన్స్ అవార్డులు-2025ను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఆరు విభాగాల ఆధారంగా 19 పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. 10 గోల్డ్, ఆరు సిల్వర్, మూడు జ్యూరీ అవార్డులు ఉంటాయని వివరించారు. స్థిరమైన ఇ-సేవలను అందించడానికి, వినూత్న, ఆలోచనలు చర్చించడానికి పరిశ్రమల నిపుణులను, విద్యావేత్తలను ఒకే వేదికపై తీసుకురావడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ సదస్సులో చర్చించనున్న అంశాల్లో ఐటి హబ్ గా విశాఖ, వికసిత్ భారత్ కోసం ఆర్టిఫిషియల్

మిగతా 2లో..

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిఎఆర్‌పిజి కార్యదర్శి వి.శ్రీనివాస్

'హైడ్రో' ఒప్పందాలను రద్దు చేయాల్సిందే

అసెంబ్లీలో చంద్రబాబు ప్రకటన చేయాలి

▶ వార్త మెయిన్ 3లో..

బల్క్ డ్రగ్ పార్కుతో జీవితాలు నాశనం

▶ వార్త 8లో..

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

▶ వార్తలు 7లో..

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

పని గంటల పెంపుపై సిఐటియు నిరసన

వార్త మెయిన్ 2లో...

మహిళాభివృద్ధికి కృషి

డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి తెలిపారు. గ్రామీణాభివృద్ధి సంస్థ చేస్తున్న కార్యక్రమాలు, డిఆర్‌డిఎ ద్వారా అందిస్తున్న సేవలు, వివిధ పథకాల గురించి శచీదేవి ప్రజాశక్తికి ముఖాముఖి ద్వారా అందించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి?

జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి విలేజి మార్టులు, మైక్రో క్రెడిట్ ప్లాన్ కింద రుణాలు, ఫార్మ్, నాన్ ఫార్మింగ్ యూనిట్లు నెలకొల్పుతున్నాం.

మైక్రో క్రెడిట్ ప్లాన్ గురించి వివరిస్తారా?

గతంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా గ్రూపులో ప్రతి ఒక్కరూ సమాన స్థాయిలో రుణాలు తీసుకునేవారు. మైక్రో క్రెడిట్ ప్లాన్ విధానంలో గ్రూపులో ఉన్న సభ్యులకు అవసరమైనంత మేర, వారికి అవసరమైన సమయంలో రుణాలు ఇస్తున్నాం. ఈ మొత్తంలో 80 శాతం ఆదాయం జనరేటింగ్ కార్యక్రమాలకు, 20 శాతం సభ్యుల వ్యక్తిగత అవసరాలకు అందిస్తున్నాం. గరిష్టంగా ఒక్కో గ్రూపునకు రూ.20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నాం. ఈ రుణాలు బ్యాంకులు 95 శాతం ఇస్తున్నాయి. ఇంతవరకు జిల్లాలో రూ.886 కోట్లు రుణాలిచ్చి, 400 యూనిట్లు నెలకొల్పడం జరిగింది.

విలేజ్ మార్టల పరిస్థితి ఏమిటి ?

జిల్లాలో సబ్బవరం, చోడవరం, మాడుగుల, మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల్లో విలేజీ మార్టులు ఏర్పాటుచేశాం. వీటి ద్వారా డ్వాక్రా మహిళలు తయారుచేసిన వివిధ రకాల వస్తువులను విక్రయిస్తున్నారు. ప్రస్తుతానికి మాడుగుల మినహా మిగిలిన

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అదానికి కొండ... ఉపాధికి ఏదీ అండ...

274 ఎకరాల్లో 100 మెగావాట్ల డేటా సెంటర్, ఐటి బిజినెస్ పార్క్ 15 ఎకరాలు, స్కిల్ యూనివర్శిటీ వస్తాయా? అన్నది అనుమానమే. ఎకరా ఇక్కడ రూ.20కోట్లు ఉన్నప్పటికీ రూ.కోటికే అదానికి కట్టబెట్టే చర్యలు ఊపందుకున్నాయి.

పర్యావరణ పరిమితులేమిటి? ఆదాని ప్రాజెక్టుకు సవాళ్లేమిటి?

రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎస్ఇఐఎ) నిబంధనలను చూస్తే ప్రాజెక్టు భూమిలో విశాఖలోని ఎకో సెన్సిటివ్ జోన్ కంబాల కొండకు 900 మీటర్ల దూరంలోనే ఉన్నందున అదాని కంపెనీ తీసుకునే జాగ్రత్తలపై నివేదిక ఇంతవరకూ లేదు. కిలోమీటరు దూరం వరకూ ఎలాంటి పేలుళ్లు, భారీ భవంతులూ నిర్మించకూడదన్న నిబంధనలున్నాయి. గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేయాలి. ఈ ప్రాజెక్టు ఆచరణలోకి వస్తే రోజుకు 2700 కిలోలీటర్ల నీరు అవసరం. దీంట్లో 1500 కిలోలీటర్ల వరకూ జివిఎంసి నుంచి మిగిలిన నీటి కోసం సూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పెట్టి రీ సైకిల్ చేసి వినియోగించాలని రూల్ ఉంది. ఇవన్నీ చేసినా డేటా సెంటర్ నిర్మాణం, తర్వాత వెలువడే ఘన, ద్రవ, వాయు వ్యర్థాల వల్ల పర్యావరణ కాలుష్యంపై నివేదిక లేకుండానే కూటమి ప్రభుత్వం అదాని కోసం తహతహలాడుతోంది.

నేటి నుంచి ఈ గవర్నెన్స్ సదస్సు

ఇంటెలిజెన్స్, సివిల్ సర్వీసెస్ డిజిటల్ రూపాంతరం, ఈ - గవర్నెన్స్‌లో సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ సేవల అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ - గవర్నెన్స్ కార్యక్రమాలు వంటి అంశాలను ప్రధానంగా చర్చించనున్నట్లు వివరించారు. ఈ మీడియా సమావేశంలో ఐటి ఈ అండ్ సి డిపార్ట్‌మెంట్ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, డిఎఆర్‌పిజి సంయుక్త కార్యదర్శి సరితా చౌహాన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ నందకిషోర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విశాఖకు చంద్రబాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారంఉదయం 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. 9.45 గంటలకు 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. ముందుగా ఈ గవర్నెన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం 12 గంటలకు విజయవాడ తిరిగి వెళతారు. రాష్ట్ర ఐటి మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా హాజరు కానున్నారు.

మహిళాభివృద్ధికి కృషి

చోట్ల లాభదాయకంగానే నడుస్తున్నాయి.

మన డబ్బులు మన లెక్కలు యాప్ గురించి వివరిస్తారా ?

సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో సభ్యులు తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు ఎంత రుణం కట్టారు, ఇంకా ఎంత రుణం చెల్లించాల్సి ఉంది అనే విషయాలు సభ్యులకు వ్యక్తిగతంగా ఈ యాప్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుంది. ప్రస్తుతానికి సబ్బవరం, మునగపాక మండలాల్లో మండలానికి 5 విఒల ద్వారా అమలు చేస్తున్నాం.

ఫార్మింగ్, నాన్ ఫార్మింగ్ యూనిట్ల గురించి వివరించండి

ఫార్మింగ్ యూనిట్లలో తేనె టీగలు, కోళ్ల ఆవులు, చేపల బోట్లు, పౌల్ట్రీ, మేకలు పందుల పెంపకం, డ్రై ఫిష్ యూనిట్లకు రుణాలు అందిస్తున్నాం. నాన్ ఫార్మింగ్ యూనిట్లలో చిరుధాన్యాలు, ఇవి వెహికల్ ద్వారా కూరగాయలు, కోడిగుడ్లతో 25 రకాల వంటకాలు తయారీ యూనిట్లు, డ్రోన్లు పది యూనిట్లు 80 శాతం రాయితీపై గరిష్టంగా రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు అందిస్తున్నాం. వీటిలో ప్రధానంగా నాతవరం, గొలుగొండ మండలాల్లో కోరమీను చేపల పెంపకంపై శిక్షణ ఇచ్చాం. అచ్యుతాపురంలో సముద్రపు నాచు పెంపకంపై 100 మందికి రూ.8 లక్షల రుణాలు అందించాం. నర్సీపట్నంలో అరకు కాఫీ ఐదు యూనిట్లకు రుణాలు అందించాం. ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిలో మహిళా సమాఖ్య ద్వారా రూ.8లక్షలతో క్యాంటీన్ ఏర్పాటుచేశాం.

జిల్లాలో వివిధ పింఛన్లు ఏ మేరకు ఇస్తున్నారు ?

జిల్లాలో 2.57 లక్షల మందికి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు ఇస్తున్నాం. ఈ నెలలో రూ.108 కోట్ల పింఛన్లు అందించాం.

అభయ హస్తం పథకంలో ఎంతమందికి పింఛన్లు ఇస్తున్నారు?

అభయ హస్తం పథకంలో జిల్లాలో 81,738 మంది సభ్యులు ఉన్నారు. 12,903 మందికి అభయ హస్తం పింఛన్లు అందిస్తున్నాం.

అమెజాన్ తరహాలో ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ ద్వారా డ్వాక్రా మహిళలు తయారుచేసిన 1277 వస్తువులను మార్కెటింగ్ చేస్తున్నాం.

జాతీయ సదస్సును విజయవంతం చేయండి

జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్, రాష్ట్ర ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అధికారులంతా సమన్వయంతో పనిచేసి 28వ జాతీయ ఈ-గవరన్నెన్స్ సదస్సును విజయవంతం చేయాలని జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్, రాష్ట్ర ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్ కోరారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, ఇతర అధికారులతో కలిసి విశాఖ కలెక్టరేట్‌లో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమ, మంగళవారాలలో నోవాటెల్ హోటల్ లో జరగనున్న సదస్సు నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై కేంద్ర, రాష్ట్ర, జిల్లా అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కార్యక్రమ నిర్వహణలో ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభంగా ఉండేందుకు అధిక సంఖ్యలో కౌంటర్లు పెట్టాలని, ప్రత్యేక వెబ్ లింక్ ఓపెన్ చేసి ఆన్ లైన్‌లో కూడా రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్‌లో ఉండే వారు అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరేం అడిగినా సమాచారం ఇచ్చేలా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. లైజన్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎయిర్ పోర్టు, రైల్వే స్టేషన్ నుంచి వచ్చే అతిథులను ప్రధాన వేదికకు తీసుకురావాలని, వారికి కావాల్సిన సహాయ, సహకారాలు అందించాలన్నారు. సదస్సులో రాజకీయ, అధికార ప్రముఖులు భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు.

ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

సీతారాం ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హిందూస్థాన్ షిప్‌యార్డులోని ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని పబ్లిక్ సెక్టర్ కో-ఆర్డినేషన్ కో-కన్వీనర్ కె.కుమారమంగళం డిమాండ్ చేశారు. మల్కాపురంలోని సిఐటియు ఆఫీసులో హెచ్ఎస్ఎల్ లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ 9వ మహాసభ బిఎస్ఎన్.రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముందుగా సీతారాంఏచూరి చిత్రపటానికి కుమారమంగళం పూలమాల వేసి నివాళులర్పించారు. మూడేళ్ల కార్యదర్శి నివేదికను ఎస్.ప్రసాద్ ప్రవేశపెట్టారు. సభ్యులు ఆమోదించారు. ఈ మహాసభలో 13 తీర్మానాలు ప్రవేశపెట్టి మహాసభ ఆమోదించింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వానపల్లి ప్రసాదు, గౌరవాధ్యక్షులుగా జి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ప్రసాదు, 16 మంది ఆఫీస్ బేరర్స్, 15 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవి.రమణమూర్తి, ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, పి.పైడిరాజు పాల్గొన్నారు.

ఎల్.ఏంజెల్స్ స్కాలర్‌షిప్ పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రతిభ గల 30 మంది పేద విద్యార్థులకు జపాన్‌కు చెందిన ఎల్ ఏంజెల్స్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ రూ.3.60 లక్షలు విలువైన స్కాలర్‌షిప్‌ను అందజేశారు. రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్ ఏంజెల్స్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్‌కు చెందిన 22 మంది ప్రతినిధులు హాజరై స్కాలర్‌షిప్, బహుమతులు అందజేశారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు యోషి నగౌర మాట్లాడుతూ, స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు తమ ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేసుకుని భారత దేశ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. తమ అసోసియేషన్ ద్వారా ఏటా సహాయాన్ని కొనసాగిస్తామన్నారు. విశాఖలో స్కాలర్‌షిప అందజేసేందుకు వీలుగా ఎల్ ఏంజెల్స్ సమన్వయకర్త మండ జానకిరామ్ అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ పూర్వ అధ్యక్షులు, ఎల్ ఏంజెల్స్ సమన్వయకర్త మండ జానకిరామ్ మాట్లాడుతూ, ప్రతిభ గల పేద విద్యార్థులకు సహాయం అందించాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎల్ ఏంజెల్స్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రోటరీ పూర్వ గవర్నర్ ఎంసి.దాస్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ అధ్యక్షులు పిల్లలమర్రి రఘు, కార్యదర్శి బిఎస్ఎన్ బెనర్జీ, కోశాధికారి వి.పాండురంగరాజు, హనుమంతరావు, పూర్వాధ్యక్షులు బి.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, బహుమతులు అందించిన అసోసియేషన్ ప్రతినిధులు

వెయ్యి ఆలయాలు కాదు.. పాఠశాలలు, కాలేజీలు నిర్మించండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని దళితవాడలలో వెయ్యి ఆలయాలను నిర్మించడం కాదని, పాఠశాలలు, కాలేజీలు నిర్మించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు టి.శ్రీరామమూర్తి, జిల్లా నాయకులు వై.నూకరాజు డిమాండ్‌చేశారు. దళిత వాడల్లో 1000 ఆలయాలను నిర్మించాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ ప్రకటించడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలోని అనేక గ్రామాలలో దళితుల పట్ల వివక్షత చూపుతున్నారని, ఈ పరిస్థితులలో 1000 ఆలయాలు నిర్మిస్తే ఆ వివక్షత మరింత కొనసాగుతుందని అభిప్రాయపడ్డారు. వాటికి బదులుగా రాష్ట్రంలో కార్పొరేట్ స్థాయి స్కూళ్లు, కాలేజీలు, హాస్టళు నిర్మిస్తే దళిత, అణగారిన వర్గాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాకుండా ఉన్నత స్థాయి ఉద్యోగులుగా, మేధావులుగా తీర్చిదిద్దే నాయకులు అవుతారని పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణానికి పెట్టే ఖర్చు విద్యార్థుల అభివృద్ధికి చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

బీచ్ రోడ్డులో ఐఒబి స్వచ్ఛతా హీ సేవ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఒబి) ఆధ్వర్యాన ఆర్‌కె.బీచ్ రోడ్డులో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా వాకథాన్ , పరిశుభ్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 80 మందికి పైగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజినల్ మేనేజర్ రవి కుమార్ గుప్తా మాట్లాడుతూ, స్వచ్ఛత ప్రాముఖ్యత, పౌరుల బాధ్యతను వివరించారు. ఈ ప్రచారంలో భాగంగా రాబోయే వారంలో బ్యాంక్ తీసుకోబోయే వివిధ కార్యక్రమాల గురించి వివరించారు.

పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ప్రతినిధులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖలో సోమ, మంగళవారాల్లో జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సులో నేపథ్యంలో కలెక్టరేట్, జివిఎంసి ప్రధాన కార్యాలయాల్లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఆయా కార్యాలయాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరాయి.

ఆకట్టుకున్న ఫ్యాషన్ డిజైన్స్ ప్రదర్శన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నం పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ప్రధానంగా ఫ్యాషన్స్, ఇంటీరియర్, ఫొటోగ్రఫీకి సంబంధించిన పలు రకాల శైలిని ఔత్సాహికులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ ప్రతినిధి స్వాతి బండారు మాట్లాడుతూ, తమ సంస్థ తరపున మూడవ ఎడిషన్‌గా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసామన్నారు. ఫ్యాషన్, ఇంటీరియర్, ఫొటోగ్రఫీ రంగాలలో రాణించాలనుకునే వారికి ఈ ప్రదర్శన చక్కని మార్గదర్శిగా ఉంటుందని చెప్పారు. ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్స్ కళాకారులు, ఫ్యాషన్ డిజైనర్స్, ఫొటోగ్రాఫర్లలోని విశిష్టమైన ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనలో నగరానికి చెందిన ఔత్సాహికులు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు.

మోటో ప్యాడ్ 60 నియో విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మొబైల్ టెక్నాలజీలో ఎఐ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ అయిన మోటోరోలా రూ.15 వేల కంటే తక్కువ ధరలో మోటో ప్యాడ్ 60 నియోను విశాఖ మార్కెట్‌లో విడుదల చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సంపత్ కుమార్ మాట్లాడుతూ, ఈ టాబ్లెట్, 90 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో కూడిన ఏకైక 11” 2.5కే డిస్‌ప్లేతో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందని తెలిపారు. కేవలం 490 గ్రాముల బరువు, 6.9 మి.మీ. సన్నని కొలతలు కలిగిన మోటో ప్యాడ్ 60 నియో అత్యంత తేలికైన, సన్నని 5జి -రెడీ టాబ్లెట్ అని వివరించారు. సులభమైన ఫైల్ బదిలీ, స్క్రీన్ షేరింగ్, క్రాస్ డివైస్ కంట్రోల్ కోసం అధునాతన స్మార్ట్ కనెక్ట్ ఫీచర్ ద్వారా శక్తివంతమైనదని తెలిపారు. దీని ధర రూ.12,999 నుండి ప్రారంభం అవుతుందని వివరించారు.

ముగిసిన రీజనల్ సంవాద్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కమిటీ భాగస్వామ్యంతో నిర్వహించిన రీజనల్ సంవాద్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ మాట్లాడుతూ సంవాద్ అనేది దేశవ్యాప్తంగా ఆదివాసులను ఒక వేదికపైకి తీసుకురావడానికి ట్రైబల్ ఐడెంటిటీని టాటా స్టీల్ ఫౌండేషన్ ద్వారా అంకిత టోప్పో, జెమ్స్ వింజ్, క్రాంతి కిరణ్ దొర, వెంకటరాజా హాజరయ్యారని తెలిపారు. ఈ సంవత్సరం మొదటి సారి అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖపట్నం జిల్లా ఆదివాసుల సంప్రదాయాలు, సంస్కృతి, అభివృద్ధి, ఆలోచనలను పంచుకోవడానికి ప్రాంతీయ సంవాద్ కార్యక్రమం ఎంవిపిలోని గిరిజన్ భవన్‌లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బాక సత్యరావు, నాయకులు ముత్యంగి ప్రసాదరావు, సీసా శోభన్, ప్రసాదరావు, జి.దాలిబాబు, కొక్కుల రామారావు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులు తక్షణమే ఆపాలి

- వీధి వ్యాపారులు, చిల్లర వర్తకులకు ప్రత్యామ్నాయం చూపాలి
- అఖిలపక్ష పార్టీ, ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల సంఘీభావం

ప్రజాశక్తి -మధురవాడ : ముందస్తు సమాచారం లేకుండా జివిఎంసి చేపడుతున్న అక్రమ తొలగింపులను తక్షణమే ఆపాలని, బాధితులకు వెంటనే ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం మధురవాడ సిపిఐ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ ఇతర పార్టీలతోపాటు సిఐటియు, ఎఐటియుసి, ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, విశాఖ నగరంలో పొట్ట కూటికోసం వేలాది మంది తోపుడు బళ్లు, చిరువ్యాపారాలతోనే జీవనం సాగిస్తున్నారన్నారు. వీరందరికీ జివిఎంసి జోన్లు వారీగా జోనల్ కమిటీలు ఏర్పాటు చేసిందని, వ్యాపారాలకు కేంద్రం ప్రభుత్వం ముద్ర రుణాలు మంజూరు చేసిందన్నారు. కొందరికి జీవిఎంసి గుర్తింపు కార్డులతోపాటు ట్రేడ్ లైసెన్సులు మంజూరు చేయగా, పన్నులు చెల్లించి వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముందస్తు సమాచారం లేకుండా, ఎటువంటి గడువు ఇవ్వకుండా పోలీసు బలగాలతో వచ్చి బెదిరింపు చర్యలకు పాల్పడి, దుకాణాలను తొలగించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేసి ఖండించారు.

జివిఎంసీ పరిధిలో హాకర్ జోన్లు ఏర్పాటు చేసి వీరందరికీ వ్యాపారాలు చేసుకునేలా చూడాలని, ఆక్రమణ తొలగింపులోనూ వివక్ష వీడాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు అధ్యక్షన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం నాయకుడు డి అప్పలరాజు, వైసిపి వార్డు అధ్యక్షులు పోతిన హనుమంతురావు, పోతిన శ్రీనివాసరావు, సిపిఐ నాయకుడు వి సత్యనారాయణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎం మన్మధరావు, సిఐటియు నాయకుడు పి రాజ్ కుమార్, ఐద్వా నాయకురాలు కె కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులోనూ స్వామి భక్తి

మేయర్ సమీప బంధువు దుకాణం జోలికెళ్లని జివిఎంసి

గాజువాక.: ఆక్రమణల తొలగింపులో జివిఎంసి అధికారులు స్వామి భక్తిని చాటుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గాజువాకలో రోడ్లపై ఫుట్‌పాత్‌లపై మూడురోజులుగా ఆక్రమణలు తొలగిస్తున్న జివిఎంసి యంత్రాంగం, ఆదివారం అందుకు భిన్నంగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. జివిఎంసి మేయర్ సమీప బంధువుకు చెందినది కావడంతో సాయి మాధురి మెడికల్ షాప్ వద్ద ఫుట్‌పాత్‌ను టచ్ చేయకపోగా, బోర్డునైనా తొలగించలేదని, అలాగే, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెందిన స్థలంలో ఫుట్‌పాత్‌ను కూడా ముట్టుకోలేదని అంటున్నారు. ఇదెక్కడి న్యాయమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జివిఎంసి ప్రధాన కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని బాధితులు హెచ్చరిస్తున్నారు.

నేడు జివిఎంసి వద్ద ధర్నా

కొమ్మాది కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న చిరు వర్తకులు

కొమ్మాది : తోపుడు బళ్లు, దుకాణాలను తొలగించి, తమ బతుకులను రోడ్డు పాల్జేయడం న్యాయం కాదని జివిఎంసి కమిషనర్‌ను చిరువ్యాపారులు ప్రశ్నించారు. ఆదివారం ఆదివారం కొమ్మాది మాస్టర్‌ప్లాన్ రోడ్డులో ఈ ప్రాంత చిల్లర వర్తకులు, వివిధ వృత్తి దారులు నిరసన చేపట్టారు. తమకు జరిగిన అన్యాయంపై సోమవారం చలో జివిఎంసి ఆందోళనను నిర్వహించి, కమిషనర్‌ను ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆటో ప్రచారజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజు కుమార్ మాట్లాడుతూ సామాన్యుల జీవితాలతో జివిఎంసి కమిషనర్ చెలగాటమాడడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చలో జివిఎంసి ధర్నాలో పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.సురేష్, పి.అజయ్, జి.గోపి, కె.శ్రీలక్ష్మి,ఎస్‌కె. శైలా భాను, ఎన్ నవీన్, పి.వరలక్ష్మి పాల్గొన్నారు

ములగాడ : ఆక్రమణల తొలగింపు పేరుతో చిరు వ్యాపారుల పొట్ట కొట్టడం అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ ఆక్షేపించారు. ఆదివారం మల్కాపురంలో చిరువ్యాపారులతో సమావేశంలో నగరంలో జివిఎంసి ఆక్రమణ తొలగింపు పేరుతో జివిఎంసి చేస్తున్న దౌర్జన్యాన్ని ఖండించారు. సిపిఐ విశాఖ జిల్లా నాయకులు గుడాల రాంబాబు నాయకులు చంద్రశేఖర్ రామకృష్ణ, కనకేశ్వరరావు పాల్గొన్నారు,

ఆరిలోవ : చిరువ్యాపారుల దుకాణాలు, తోపుడుబళ్లు తొలగింపును నిరసిస్తూ ఆదివారం ఆరిలోవ అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ, ముందస్తు సమాచారం లేకుండా తొలగింపులను ఖండించారు. చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం జివియంసి ప్రధాన కార్యాలయం వద్ద ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరిలోవ చిరువ్యాపారస్తుల సంక్షేమ సంఘం (ఎఐటియుసి) గౌరవాధ్యక్షుడు పిల్లి వీర్రాజు, నాయకులు కరక రమణ, రెడ్డి సత్తిరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార.: నగరంలో రోడ్డు పక్కన దుకాణాలను తొలగించి, చిరువ్యాపారుల పొట్టకొట్టడం దుర్మార్గమని ఏఐటియుసిజిల్లా కార్యదర్శి పడాల గోవింద్ ఆవేదన వ్యక్తం ఆదివారం సీతమ్మధార సాయిబాబా టెంపుల్ వద్ద పార్కులో సీతమ్మధార ప్రాంత చిరు వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో చిరు వ్యాపారస్తుల సంక్షేమ సంగం నాయకులు. కష్ణ. చిన్న. అప్పలనాయుడు బాబురావు శ్రీనివాస్ పాల్గొన్నారు

బుద్ధ గయను బౌద్ధులకు అప్పగించాలి

ప్రజాశక్తి కరాస: బుద్ధునికి జన్మస్థలం బౌద్ధగయను బౌద్ధేతరుల కబంధహస్తాల నుంచి రక్షించి బౌద్ధులకు అప్పగించాలని జిల్లా మహాబోధి సొసైటీ, బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు గుణపూడి బాబులు, బోర వేణుగోపాల్ గౌతం డిమాండ్ చేశారు. ఆదివారం మర్రిపాలెం రైతు బజార్ దరి గౌతమబుద్ధ ధ్యానం వనం బుద్ధ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ముందుగా బుద్ధ వందనం ప్రార్థన నిర్వహించారు.బీహార్ ప్రభుత్వం 1949 బుద్ధ గయ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలిని, బిటిఎంసి కమిటీలో పూర్తిగా బౌద్ధులనే నియమించాలని.డిమాండ్ చేశారు.కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, వివి దుర్గారావు, గొంది నవీన్, కొత్త పిల్లి వెంకటరమణ, జి. రవికుమార్, యిర్రల వెంకటరావు, సిరికి సింహాద్రి, బొడ్డు రాము, ఎమ్. హరి వినాయక్, ధనాల ఈశ్వర రావు, బోర సిద్ధార్థ గౌతమ్, పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను ఆదివారం ఎపి హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ ఇఒ వేంద్ర త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత న్యాయమూర్తిని వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఇఒ స్వామిశేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. ఎఇఒ కె. తిరుమలేశ్వరరావు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

టిడిపి మండల కమిటీల నియామకం

ప్రజాశక్తి- భీమిలి, ఆనందపురం, పద్మనాభం : భీమిలి నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల టిడిపి కమిటీలను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ఎంవిపి కాలనీలోని తన నివాసంలో ప్రకటించారు. భీమిలి మండల కమిటీ అధ్యక్షునిగా మాజీ జెడ్‌పిటిసి శరగడం అప్పారావు, ఆనందపురం మండల కమిటీ అధ్యక్షునిగా తాట్రాజు అప్పారావును నియమించగా, పద్మనాభం మండలానికి రెండోసారి కోరాడ రమణను నియమించారు. ఆనందపురం కమిటీ ఉపాధ్యక్షునిగా సూరాల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా లోడగల వెంకట్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సాడి ముత్యాల రెడ్డి, ఎర్ర పైడిరాజు, రేగాని ఆదినారాయణ, కార్యదర్శులుగా మరిపల్లి ప్రసాద్ రావు, ఇల్లి పిల్లి సన్యాసిరావు, నిమ్మల అప్పలరాజు, కోశాధికారిగా లంక రమణ నియమితులయ్యారు. పద్మనాభం మండల కమిటీ ఉపాధ్యక్షునిగా సబ్బవరపు రామును. ప్రధాన కార్యదర్శిగా ఆవాల గంగరాజు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా కరిమిరెడ్డి లక్ష్మి, సుంకర పైడినాయుడు, పైలా శ్రీనివాసరావు,. కార్యదర్శులుగా కె.కృష్ణప్పడు. మహంతి అప్పలరమణ. పోలిపల్లి మోహన్. కోశాధికారిగా గెద్ద ప్రసాద్‌లను నియమించారు. కొత్త కమిటీలను ఎమ్మెల్యే గంటా సత్కరించి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలోభీమిలి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, చిక్కాల విజయ్ బాబు, డి నరసింహమూర్తి రాజు, మజ్జివలస పిఎసిఎస్ అధ్యక్షులు జి.ఎల్లయ్య పాల్గొన్నారు



మూడు మండలాల కమిటీ నేతలతో ఎమ్మెల్యే గంటా

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలో సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆదివారం 5వ జోన్ తాటిచెట్లపాలెం నుండి రైల్వే ఫంక్షన్ హాల్ జంక్షన్ వరకు సెంటర్ మీడియన్ సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాటిచెట్లపాలెం నుండి రైల్వే ఫంక్షన్ హాల్ వరకు సుమారు రూ.38 లక్షలు జీవీఎంసీ నిధులతో సెంటర్ మీడియన్ సుందరీకరణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీరు సంపత్ కుమార్‌ను ఆదేశించారు అయితే 28వ జాతీయ ఈ గవర్నెన్స్ సదస్సుకు సోమ, మంగళవారాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు రాష్ట్ర మంత్రులు ,ఇతర ప్రముఖులు ఈ మార్గంలో వస్తున్నందున రెండు రోజులు పాటు పనులు నిలుపుదల చేసి, బుధవారం నుంచి వేగవంతం చేయాలన్నారు. జివిఎంసి డిఇఇ భరణి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో హెచ్ఎం మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని వాకపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకల సత్యం శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. డిప్యూటీ డిఇఒ అప్పారావు తెలిపిన వివరాలివి. కొరుప్రోలులో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ ముగించికొని దసరా సెలవులకు ఇంటికి వెళ్తున్న సమయంలో బయ్యవరం హెరిటేజ్ పాల డెయిరీ వద్ద కూడలిలో సత్యం రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. ఈ సంఘటన తెలిసిన ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామానికి చెందిన బోని ముత్యాలనాయుడు(68) గుండెపోటుతో మరణించారని అతని కుమారుడు నరేష్ పోలీసులకు తెలిపాడు. ఈనెల 18న పొలానికి వెళ్లిన ముత్యాలనాయుడు తిరిగి రాకపోవడం, అతని ఫోను పనిచేయకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా, మిస్సింగ్ కేసు నమోదైంది. అయితే ఆదివారం ఉదయం పొలంలోనే చనిపోయి ఉండడాన్ని అదే గ్రామానికి చెందిన కాళ్ళ శ్రీనివాసరావు ద్వారా తెలుసుకున్న ఫిర్యాదుదారు నరేష్, గుండెపోటుతో మరణించి ఉండొచ్చని, ఎవరిపైనా అనుమానం లేదని పోలీసులకు తెలిపాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

80 మందికి హోమియో వైద్యసేవలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. 80 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.వైద్యులు టి జగన్నాథరావు, టిజె మోహన్ సేవలు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్ మూర్తి, కె చంద్రశేఖర్, కెవి భానోజీ రావు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై కఠిన చర్యలు

ప్రజాశక్తి- పెందుర్తి : ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన కఠినచర్యలు తప్పవని తహశీల్దార్ వెంకట అప్పారావు హెచ్చరించారు. ప్రభుత్వ స్థలంలో తవ్వకాల చేపడుతున్నారని అందిన ఫిర్యాదుమేరకు శానాతివానిపాలెంలో సర్వేనెంబర్ 22లోని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వభూమిపై సర్వే చేస్తామని, ఆక్రమణలుగా నిర్ధారణైతే తొలగింపులతోపాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

బీమా పరిహారం చెక్కు అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని సింగనబంద గ్రామానికి చెందిన బాధితురాలు రమణమ్మకు పిఎం జీవన్ జ్యోతి బీమా పథకం కింద మంజూరైన రూ 2 లక్షల చెక్కును ఆదివారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది అందజేశారు. సన్యాసి మృతితో అతని భార్యకు బీమా చెక్కును అందించారని సర్పంచ్ జివి నారాయణ తెలిపారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రైతుబజార్లలో వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని మార్కెటింగ్ శాఖ చైర్మన్ ఎలమంచిలి అపర్ణ ప్రసాద్ సూచించారు. ఆదివారం సీతమ్మధార రైతు బజార్ సందర్శించారు. రైతులతో మాట్లాడారు. వినియోగదారులతో మర్యాదగా మసలుకోవాలని, పట్టికల్లో ప్రకటించిన ధరలకే కూరగాయలను విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ టమోటా, ఉల్లిపాయలు, కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్, డైరెక్టర్స్ మొల్లి శోభ, నాగులపల్లి లత, మైలపిల్లి తాతారావు, పద్మజ, ఉప్పాటి శివ శంకర్ల లలిత, రైతు బజార్ ఇఒ చెట్టి కృష్ణమూర్తి సహాయకులు సతీష్ పాల్గొన్నారు

పేరుకుపోయిన చెత్తతో పరేషాన్

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 25, 26, వార్డుల్లో చెత్త పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. 25వ వార్డు దుర్గాగణపతి ఆలయం కింద రోడ్డు మార్గంలో మూడు రోజులుగా చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలు బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. 26వ వార్డులో జగ్గర బ్రిడ్జి వద్ద చెత్త నాలుగు రోజులుగా తరలించకపోవడంతో డస్ట్‌బిన్లు నిండిపోయి, రోడ్డంతా చెత్త మయంగా మారిందని స్థానికులుఅంటున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, పరస్పర యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబోధ చేసిన గురువులను సన్మానించారు. అద్యంతం ఆటపాటలతో, భావోద్వేగాల ఉల్లాసంగా గడిపారు కార్యక్రమంలో పూర్వ హెచ్‌ఎం ఎంఎస్. ప్రసాద్, ప్రస్తుత హెచ్‌ఎం పి. కామేశ్వరరావు, ఉపాధ్యాయులు సత్యారావు, బులుసు వెంకటేశ్వరరావు, జానీ, శివనారాయణ, వెంకటేశ్వర, రమేష్, శ్రీనివాస్, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో అండర్ 17 బాలికలు. 49 కిలోల విభాగంలో కొమ్మాది కృష్ణవికాస్ విజయం స్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఎ.భాగ్యశ్రీ , అండర్ 14 బాలులు, 35 కిలోల విభాగంలో పిఎం పాలెం మాలతాంబ విద్యానికేతన్ 7వ తరగతి విద్యార్థి కె. తోషన్ ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు అర్హత స్థాధించారు.విజేతలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖపట్నం కార్యదర్శి వి. పుష్పలత, ఎస్‌ఎజిఎఫ్ పిడిలు చిన్న దేవుళ్ళు, నాగేశ్వరరావు అభినందించారు. ఏపి అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆనంద్, కోచ్‌లు బి జగదీష్, హేమంత్ , సత్యనారాయణ పాల్గొన్నారు.

విలువిద్య పోటీలకు జోషిత

ప్రజాశక్తి- ఆనందపురం : విశాఖపట్నం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అరకు వ్యాలీ స్పోర్ట్స్ స్కూల్ వేదికగా జరిగిన 14ఏళ్ల బాలబాలికలవిలువిద్య ఎంపిక పోటీలలో గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె. జోషిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జోషితను పాఠశాల కమిటీ సభ్యులు బాలి రవి,. సావిత్రి అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు అర్హత

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని పిఎంశ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం పి.కామేశ్వరరావు తెలిపారు. పెందుర్తి మండలం వి.జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ఆనందపురం నుంచి 12 మంది విద్యార్థులు పాల్గొనగా, టెన్ విద్యార్థులు ఎం. శ్రీను, బాలభాస్కర్, దేవి ప్రసన్న సత్తాచాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు.వీరిని హెచ్‌ఎంతోపాటు పిఇటిఎన్. నర్సింహమూర్తి, ప్రసాద్, బుజ్జి తదితరులు అభినందించారు.

ఘనంగా శాంతి దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలిజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ ఎల్‌బి కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. తొలుత సర్వ మత ప్రార్థనలు చేశారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ చైర్మన్.నరవ ప్రకాశ రావు అధ్యక్షతన సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్ వి బాలమోహన్‌దాస్, ఆచార్య కె.రవి మాట్లాడుతూ ఉగ్రవాదంతో ఆయుధ సంపత్తిని పెంచుకుంటున్న ప్రపంచ దేశాల మధ్య నమ్మకం నానాటికి సన్నగిల్లుతోందన్నారు. శాంతిని నెలకొల్పడంతో ఐక్యరాజ్య సమితితో భారత్ పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని పోలీసులకు అప్పగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, ప్రజ్ఞాన కుమార్, డాక్టర్ కెవిఎస్ మూర్తి, చాట్ల బాబూరావు రెడ్డి, బౌద్ధభిక్షువు కంటే భిక్షు, రాజధామ్ భిక్షు .బంగార్రాజు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలం

• డివైఎఫ్‌ఐ మల్కాపురం జోన్ సభలో జిల్లా అధ్యక్షుడు రాజు

ప్రజాశక్తి-ములగాడ : నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విఫలమయ్యాయని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి యువిఎస్ఎన్.రాజు మండిపడ్డారు. ఆదివారం 59 వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో డివైఎఫ్‌ఐ మల్కాపురం జోన్ 10వ మహాసభలో ముందుగా యూనియన్ పతాకాన్ని రాజు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మరణించిన డివైఎఫ్‌ఐ కార్యకర్తలు నాయకులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్.నమీన్, ఎ.ప్రశాంత్ అధ్యక్షవర్గంగా మహాసభలో జోన్ కార్యదర్శి ఎస్.వాసు మూడేళ్ల కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

అనంతరం డివైఎఫ్‌ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు రాజు, మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలు మూసివేత, లేదంటే ప్రయివేటుకు ధారాదత్తం చేయడమే లక్ష్యంగా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎక్కడ నుంచి వస్తాయని ప్రశ్నించారు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఎలా ఇస్తారో చెప్పాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని42 విభాగాలను ప్రైవేటుపరం చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలకు రాష్ట్రంలోని అధికార విపక్షాలు వంతపాడడం అన్యాయమన్నారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని, ఖాళీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని శ్రీహరిపురం హాస్పిటల్‌ను వంద పడకలుగా మార్చాలని, వార్డులో క్రీడా స్థలాలు ఏర్పాటు చేయాలని, కాలుష్యాన్ని అరికట్టాలని, పెదగంట్యాడలో అదాని సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టొద్దని పలు తీర్మానాలు చేశారు. డివైఎఫ్‌ఐ జోన్ జిల్లా సహాయ కార్యదర్శి శైలజ శ్రావణ్, జోన్ అధ్యక్షులు బూడి శ్రీను మాట్లాడుతూ, ఈనెల 28న మల్కాపురం లో నిర్వహించే డివైఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ర.

మహాసభలో పాల్గొన్న డివైఎఫ్‌ఐ నేతలు

మల్కాపురం జోన్ నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ మల్కాపురం జోన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బూడి శ్రీను, కార్యదర్శిగా ఎస్ వాసు, ఉపాధ్యక్షులుగా డి రాజేష్, జి దాసు, కోశాధికారిగా జి. గణేష్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఆర్ సమీన్, ఎస్‌కె. సుభాని, సహాయ కార్యదర్శులుగా ఎం కిరణ్, జి శంకర్, బి ప్రసాద్ కమిటీ సభ్యులు ప్రశాంత్, కుమార్, హేమంత్, జె కోటి, ఇ.రామకృష్ణ, మహేంద్ర, ప్రేమ్ ఎన్నికయ్యారు.

ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగమవ్వాలి

• ఐద్వా స్టీల్ జోన్ కమిటీ మహాసభలో వైటి.దాస్

స్టీల్ జోన్ కమిటీ మహాసభలో ఐద్వా నేతలు

ప్రజాశక్తి- గాజువాక : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో మహిళలు భాగస్వాములు కావాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు అధ్యక్షుడు వైటి దాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సెక్టార్-2లోని ఎంకె.పాండే భవనంలో కె.విమల, బి.పద్మావతి, కె.వేణు అధ్యక్షవర్గంలో ఐద్వా స్టీల్‌జోన్ కమిటీ ఐదవ మహాసభలో మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ, కార్మిక పోరాటాలను వివరించారు. మహిళల భాగస్వామ్యంతో ఉక్కు ప్రయివేటీకరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ మాట్లాడారు. ముందుగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ ఐద్వా ఆవిర్భావాన్ని, ఇప్పటివరకు చేపట్టిన పోరాటాలను వివరించారు. ప్రభుత్వాలు మహిళల కోసం చట్టాలు చేస్తున్నా, వాటి అమలులో చిత్తశుద్ధిని చూపడం లేదని ఆరోపించారు. ఐద్వా పోరాటాలతో మహిళా హక్కులు, చట్టాలను సాధించుకుందామన్నారు. జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, సంఘం విస్తరణ, స్టీల్‌పరిరక్షణ పోరాటంలో మహిళలు భాగస్వాములుకావాలని పిలుపునిచ్చారు.స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ప్రధానిని కోరుతూ సంతకాలు సేకరణ చేపట్టారు. మొదటి నుంచి స్టీల్ పరిరక్షణ పోరాటంలో పాల్గొంటున్న ఐద్వా నేతలు పి.సుభద్రాదేవి, కె.జనార్దనమ్మలను సత్కరించారు. ప్రజానాట్యమండలి అభ్యుదయగీతాలు అలరించాయి.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా స్టీల్ జోన్ ఐద్వా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వేణు, కె.వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కె.విమల, కె.సత్యవతి, కోశాధికారిగా పుష్ప, కమిటీ సభ్యులుగా ఎం.విజయలక్ష్మి, వి.సుమలత, ఎ.సూర్యప్రభ, జి.శాంతి, బి.పద్మావతి, హైమ, ఎస్.పద్మావతి, రమణి, చాముండేశ్వరిలను ఎన్నుకున్నారు.

భెల్ త్రిఫ్ట్ సొసైటీ బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి -గాజువాక.: బిహెచ్‌పివి, హెచ్‌పివిపి ఎంప్లాయిస్ కోపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ బడ్జెట్‌ను 56వ మహాజనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన మహాజనసభలో సంఘ ఉపాధ్యక్షులు కె. ధర్మారావు మాట్లాడుతూ సంఘాన్నివాణిజ్య దృక్పథంతో కాకుండా సంఘ ఆర్థిక స్థితికి అనుగుణంగా సభ్యులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తూ సంఘాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు.

సంఘ కార్యదర్శి మండ వెంకటరాజు వార్షిక నివేదిక వెల్లడించారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ. 6,85,738. వార్షిక లాభం వచ్చిందన్నారు. సభ్యులకిచ్చే రుణాలపై వడ్డీని 14శాతం నుంచి 12శాతానికి తగ్గించడంతోపాటు, పొదుపుపై 8శాతం వడ్డీని ఈనెల 25న చెల్లించాలని పాలకవర్గం నిర్ణయించిందన్నారు. సభ్యులకు రుణాన్ని సత్వరమే అందజేయనున్నట్లు తెలిపారు సంఘ డైరెక్టర్ జిటి.పి. ప్రకాష్ 2025-26 అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా మహాజనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో డైరెక్టర్లు జి ప్రసాద్, కెఎన్‌వి. ప్రసాద్, ఎన్‌బి. ప్రశాంత్ కుమార్, సంఘ మేనేజరు గవర వెంకట రమణారావు పాల్గొన్నారు.

బడ్జెటు ప్రవేశపెడుతున్న జిటిపి ప్రకాష్

పేరు సార్థకత చేసుకున్న 'మనసు'

ప్రజాశక్తి- సీతమ్మధార : అందరి మనసులను దోచుకొని 'మనసు' లఘుచిత్రం తన పేరును సార్థకత చేసుకుందని పలువురు వక్తలు అభివర్ణించారు. పైడి సత్యమణి నిర్మాతగా, రచయిత, నటులు, దర్శకులు పైడి శంకరరావు దర్శకత్వంలో, సినీ దర్శకులు రెడ్డెం యాదకుమార్ దర్శకత్వ పర్యవేక్షణలో నిర్మితమైన మనసు లఘు చిత్రం ప్రీమియర్ షోను ఆదివారం పౌర గ్రంథాలయంలో ప్రదర్శించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ కోరుకొండ రంగారావు ప్రోగ్రాం కన్వీనర్, వ్యాఖ్యాతగా వ్యవహరించగా, పద్మశ్రీ కూటికుప్పల సూర్యారావు, ఆచార్య ముత్యాల నాయుడు, లీడర్ రమణమూర్తి, దాడి సత్యనారాయణ రెడ్డెం యాదకుమార్, డాక్టర్ విచిత్రబాబు, నరవ ప్రకాశరావు జ్యోతి ప్రజ్వలనతో చిత్రాన్ని విడుదల చేశారు, 20 నిమిషాల నిడివి గల చిత్రంలో హీరోహీరోయిన్లు సందీప్‌సాయి, నిరోషా, ప్రధానపాత్రలో దర్శకుడు పైడి శంకరరావు, ఇతర నటులు పైడిరాజు, తదితరులు ఒదిగిపోయి నటించారని కొనియాడారు. ఫణి స్వామి, వై.అప్పారావు, కోరుకొండ రంగారావు, వేముల భాస్కరాచారి, పైడిరాజు, ఎం.టి.రాజు, బేబీ సాత్విక, కో డైరెక్టర్ సూర్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్స్ పుష్పమి, దుర్గాప్రసాద్, డిఒపి ఉదయ్, ఎడిటింగ్ శ్యామ్ కుమార్, సంగీతం కళ్యాణమోహన్, సౌండ్ ఆదిబాబు అందించారు. దర్శకులు శంకరరావు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఉలిశెట్టి శ్రీనివాస్, నవీన్ తేజ, సన్ మూర్తి, డిఆర్‌కె రావు, లోకేష్, రిటైర్డ్ ఎడిసిపి ఖాన్, రవితేజ, చలసాని కృష్ణ ప్రసాద్, ధవళేశ్వరావు, ఇమంది ఈశ్వరరావు, శివప్రసాద్ పాల్గొన్నారు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచల వరాహలక్ష్మీనరసింహ స్వామి నిత్యాన్నప్రసాదానికి పాత గాజువాక, పంతులుగారి మేడ సింహాద్రి ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన బి. శ్రీనివాసరావు రూ. లక్ష విరాళంగా అందించారు. ఆలయసన్నిధిలోని విరాళాల కౌంటర్‌లో నగదు చెల్లించి రశీదు పొందారు. ఈ సందర్భంగా దాతకు ప్రొటోకాల్ సీనియర్ సహాయకులు సూర్యనారాయణ స్వామి నిత్య అన్నప్రసాదం బాండ్ అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామి అంతరాలయ దర్శనం కల్పించి, స్వామి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షణ అధికారి బలువు సత్య శ్రీనివాస్ ప్రసాదాలను దాతకు అందజేశారు.

బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి- సీతమ్మధార. మార్షల్ ఆర్ట్స్‌తో ఆరోగ్య పరిరక్షణతోపాటు పిల్లలకు ఆత్మరక్షణ, క్రమశిక్షణ అలవడుతుందని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ డి.సూర్య ప్రకాశరావు అన్నారు. ఆదివారం నగరంలో ఒక పార్కులో బోధిధర్మ యుద్ధ కళాక్షేత్రం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.కర్షక దేవోభవ జాతీయ అధ్యక్షులు డాక్టర్. ఆడారి కిషోర్‌కుమార్, బివైకె.గురు, వెంకట్ ఆధ్వర్యంలో వంశీ, అలెక్స్, లికిల్,దుర్గా ప్రసాద్ బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్స్ అందుకోగా, కోటేశ్వరరావు, జగదీష్, శివ, రాఘవ గ్రీన్ బెల్ట్ సర్టిఫికెట్స్ పొందారు. 50 విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు.

అనాథ పిల్లలకు భోజనం

ప్రజాశక్తి -అరిలోవ :పోలేరు అమావాస్యను పురస్కరిం చుకొని ఇందిరానగర్ ఆనంద మార్గ్ హోం అనాథ పిల్లలకు ఆదివారం మధ్యాహ్న భోజనాన్ని మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు సమకూర్చారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోం పనితీరు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హోం నిర్వాహకులు సొమ్యానంద అవధూత, చైర్మన్ ఆర్‌వి.పాత్రో పాల్గొన్నారు.

ఎయులో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- వేపగుంట : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో జెడి ఫౌండేషన్ ఆధ్వర్యంలోఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఎయు విసి ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్ ప్రారంభించిన శిబిరంలో 278 మంది ఎయులోని బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులకు కంటిపరీక్షలు చేశారు. డాక్టర్ నిఖిత, మేనేజర్ ఎం.చంద్రశేఖర్, ఇతర సహాయక సిబ్బంది నేతృత్వంలో కంటి వైద్యశిబిరంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, జెడి ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ అనురాధ, శంకర్ ఫౌండేషన్ డిజిఎం, పిఆర్ కె.బంగారురాజు పాల్గొన్నారు.

పేదలింట గురువుల కొలువులు

- డిఎస్‌సిలో ఒకే గ్రామం నుండి ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపిక
- గ్రామస్తుల అభినందనలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలో కేపీ అగ్రహారం చిన్న గ్రామం. ఆ ఊరిలో ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉంది. 6వ తరగతి నుండి బయటకు వెళ్లి చదువుకోవాల్సిందే. పేద విద్యార్థులకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలే దిక్కు. కెపి.అగ్రహారానికి చెందిన పేద విద్యార్థులు దిబ్బిడి పాఠశాలకు కాలినడకన, సైకిల్ పైన వచ్చి చదువుకొని, నేడు ఉపాధ్యాయ కొలువులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ గ్రామం నుండి 2025 డిఎస్‌సిలో ఒకేసారి ముగ్గురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

ఎస్‌జిటిగా లోవరాము

కెపి.అగ్రహారం గ్రామానికి చెందిన నక్కా లోవరాము 1నుండి 5వ తరగతి వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనూ, 6 నుండి 10వ తరగతి వరకు దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్‌లోనూ, ఇంటర్మీడియట్ చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ చదివారు. 2008-10లో దూబచర్లలో ఉపాధ్యాయ శిక్షణ (టిసిసి) పొందారు. విశ్వబ్రాహ్మణ కుటుంబానికి చెందిన తల్లిదండ్రులకు కులవృత్తే ఆధారం. అన్నదమ్ముల సహకారంతో చదువుకున్న రాము 12 ఏళ్లగా ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఇటీవల విడుదలైన డిఎస్‌సి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 236 ర్యాంకు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యారు. 2012, 2014, 2018 డీఎస్సీలో విఫలమైనా నాలుడో ప్రయత్నంలో విజయం సాధించారు.

నక్కలోవరాము

స్కూల్ అసిస్టెంట్‌గా శ్రీను

ఇదే గ్రామానికి చెందిన జొన్నపల్లి శ్రీను రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. తల్లిదండ్రుల వ్యవసాయం పనులతో పాటు కూలి పనులు చేస్తూ చదివించారు. 1 నుండి 5 వరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనూ, 6 నుండి 10వ తరగతి వరకు దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్‌లోనూ చదివారు. ఇంటర్మీడియట్ రావికమతం ప్రైవేటు కళాశాలలోను, డిగ్రీ, బిఈడి చోడవరంలో ప్రైవేటు కళాశాలలో పూర్తి చేశారు. 2018 డీఎస్సీలో విఫలమైనా, పట్టుదలతో చదివి ఇటీవల విడుదలైన ఉపాధ్యాయ ఫలితాల్లో జిల్లాస్థాయిలో 14వ ర్యాంక్ సాధించి స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు.

జొన్నపల్లి శ్రీను

తెలుగు పండిట్‌గా చిన్నారి

ఇది గ్రామానికి చెందిన గోకాడ చిన్నారిది రైతు కుటుంబం. తల్లిదండ్రులు వ్యవసాయం, కూలి పనులు చేస్తూ చదివించారు. 1నుండి 8వ తరగతి వరకు కేపీ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలోనూ, 9, 10 దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్‌నూ చదివారు. ఇంటర్, డిగ్రీ బిఎడ్ చోడవరం ప్రైవేట్ కళాశాలలోను, ఎంఎ తెలుగు ఆంధ్ర యూనివర్సిటీలోనూ చదివారు. 2018 డీఎస్సీలో విఫలమైన చిన్నారి రెండవ ప్రయత్నంలో తెలుగు పండిట్ గా ఎంపికయ్యారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని ఈ ముగ్గురు నిరూపించారు.

గోకాడ చిన్నారి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు నాయకులు, రైతులు

24న 'చలో విశాఖ డెయిరీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక : పాల రైతుల సమస్యలపై ఈనెల 24న చేపట్టే చలో విశాఖ డెయిరీ కార్యక్రమంలో పాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని నాగులపల్లి, ఒంపోలు, మునగపాక గ్రామాలలో పాల రైతులతో కలిసి గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలలో పాడి రైతులకు కల్పతరువుగా ఉన్న విశాఖ డెయిరీని తమ స్వార్థ ప్రయోజనాల కోసం చైర్మన్ అవినీతిమయం చేసి డెయిరీని, రైతులను నష్టాలు పాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత పాలకవర్గం హద్దూ అదుపులేని అవినీతికి పాల్పడుతూ లాభాలను దారి మళ్లించి సొంత ఆస్తులు పెంచుకుంటూ డైయిరీకి నష్టాలు చూపిస్తున్నారని పేర్కొన్నారు. విశాఖ డెకయిరీ పాలకవర్గం అవినీతి, అసమర్థ విధానాల వలన వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని విమర్శించారు. డెయిరీ అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించి డెయిరీ ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, పాల రైతులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ పనులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

అనకాపల్లి సోషల్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో ఈవెన్యూ ప్లాంటేషన్ చెట్ల సంరక్షణ పనులు వేగవంతమయ్యాయి. మొత్తం 18 కిలోమీటర్ల పొడవున 9 ప్లాంటేషన్లలో నాటిన 7200 మొక్కల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తూ అటవీశాఖ సిబ్బంది పనులు చేపట్టారు. మొక్కల పెరుగుదల వేగంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు డిప్యూటీ రేంజర్ ఎ.నూకరాజు తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల

మండలంలోని పాములవాక గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను పిఏసిఎస్ అధ్యక్షులు వేచలపు జనార్ధన్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు రేషన్ డిపోలకుగాను 964 మంది లబ్ధిదారులకు కార్డులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భీమిరెడ్డి గోవిందరావుకు అభినందనలు

ప్రజాశక్తి-కోటవురట్ల : వైసిపి వాలంటీర్ విభాగపు రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన మాకవరపాలెం మండలానికి చెందిన భీమిరెడ్డి గోవిందరావుకు మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఆదివారం అభినందనలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రుత్తల సత్యనారాయణ, బొడ్డు గోవిందరావు, సర్పంచ్, ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లక్ష్మీదేవిపేట, బిఆర్‌టి కాలనీ, భట్లపూడి గ్రామాల లబ్ధిదారులకు ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న పీలా గోవింద

ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

తైక్వాండో పోటీలకు కెజిబివి విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో అచ్చుతాపురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి తైక్వాండ్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎం.దీప్తి, అండర్ 17 విభాగంలో పి తేజసత్యశ్రీ, డి.దీక్షిత ఎంపికైనట్లు పాఠశాల పిఇటి దేవవరపు బేబీ రాణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పిఈటిని ప్రిన్సిపల్ ఉమాదేవి, అభినందించారు.

250 మందికి దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఎం.జగన్నాథపురం గ్రామంలో ఆదివారం సురక్ష హెల్త్ ఫౌండేషన్, విష్ణు డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ సుధీర్ మాట్లాడుతూ దంత రక్షణ పట్ల శ్రద్ధ వహించాలని, నిర్లక్ష్యం. వహిస్తే క్యాన్సర్‌కు దారితీస్తుందని పేర్కొన్నారు. అనంతరం 250 మంది దంత రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో కేఎస్ ప్రకాష్ జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : విశ్రాంత ఉపాధ్యాయుడు తమ్మిశెట్టి అప్పారావు శనివారం రాత్రి సుమారు 10. 30 ప్రాంతంలో మృతి చెందారు. గతంలో ఆయన మండలంలో రాయవరం, కొరుప్రోలు, దార్లపూడి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దారు. ఆయన మరణ వార్త తెలిసిన పూర్వ విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. రాయవరం గ్రామస్తులు ఆయనకి ఘన నివాళులర్పించారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

-లోతట్టు ప్రాంతాలు జలమయం
-రోడ్డుపైకి ఉప్పొంగిన మురుగునీరు

ప్రజాశక్తి-యలమంచిలి

యలమంచిలిలో ఆదివారం ఉరుములు, మెరుపులతో వర్షం దంచికొట్టింది. ఎంతవర్షం పడిందన్నది అధికార్లు ప్రకటించనప్పటికీ అనుభవమున్న రైతులు చెప్పిన దాని ప్రకారం ఐదారు దుక్కులుంటుందని అంచనా. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మొదలైన వర్షం ఉరుములు, మెరుపులతో జడివానగా మారింది. పిక్కటిల్లే శబ్ధాలు ఉరుములతో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసింది. దానికి తోడు ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ నిలిపివేశారు. గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో మెయిన్‌రోడ్డు, గాంధీనగర్, రాజీవ్ మైదానం నీటిలో మునిగి పోయాయి. మురికి నీరు ఉప్పొంగి రోడ్డు మీదకు ప్రవహించింది. లోతట్టు కాలనీలు నీట మునిగాయి. మున్సిపల్ అధికార్లు నీట మునిగిన ప్రాంతాల్లో నీటిని ఇంజన్లతో తోడించే ప్రయత్నం చేస్తున్నట్లు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. మరో వైపు దసరా నవరాత్రి సంబరాలు జరుపుకోవడానికి ఇప్పటికే వేల ఖర్చుతో నిర్మించిన మండపాలు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. నీటితో తడిచిపోయాయి. సోమవారం పట్టణంలోని అన్ని వీధుల్లోనూ మండపాల్లో అమ్మవారిని ప్రతిష్టించే ఏర్పాట్లు చేశారు. అందుకు వర్షం పెద్దం ఆటంకం మారింది. ఈ వర్షం వరి పంటకు, జీడి, మామిడి తోటలకు బాగా ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి పొలిమేర మోహనరావు తెలిపారు.

నేలకొరిగిన చెరుకు తోటలు

అచ్యుతాపురం : ఈదురుగాలులు కారణంగా మండలంలోని పెదపాడు, కాజీపాలెం, జగ్గన్నపేట, తిమ్మరాజుపేట, హరిపాలెం తదితర గ్రామాలలో చెరుకు తోటలు నేలకొరిగాయి. వాటిని నిలబెట్టడానికి కూలీలు దొరకటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అరటి తోటల్లో మొక్కలు విరిగిపోయాయి.

గాలి వర్షానికి చెట్టు పడి ఆవు మృతి

సబ్బవరం : మండలంలో ఆదివారం ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి గొట్టివాడ గ్రామంలో టేకు చెట్టు విరిగి పడి ఒక ఆవు మృతి చెందింది. గొట్టివాడ గ్రామానికి చెందిన మడక సూర్యనారాయణ తన ఆవును కళ్ళంలో కట్టారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి కల్లంలో ఉన్న టేకు చెట్టు కూలిపోయి ఆవు మీద పడింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు ఖరీదు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు సూర్యనారాయణ తెలిపారు. ఆవు మృతితో తమ జీవనోపాధి పోయిందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని కోరారు.

అలాగే ఆరిపాక పంచాయితీ శివారు లగిశెట్టిపాలెం ఎస్సీ, బీసీ కాలనీలో విద్యుత్ స్తంభం నేలకొరిగి, విద్యుత్ తీగలు కిందకు వేలాడాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చెట్టు పడి మృతి చెందిన ఆవు

ప్రిస్కిప్షన్ లేకుండా ఎన్‌ఆర్‌ఎక్స్ డ్రగ్స్, యాంటీబయోటిక్స్ విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రెస్క్రిప్షన్ లేకుండా ఎన్‌ఆర్‌ఎక్స్ డ్రగ్స్, యాంటిబయోటిక్స్ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ హెచ్చరించారు. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు అనకాపల్లి జల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్, చోడవరం కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ సమన్వయంతో అనకాపల్లి నూకాంబిక దేవాలయం దరి సత్యలక్ష్మి గ్రాండ్‌లో ఆంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ నార్కోటిక్/ సైకోట్రోపిక్ డ్రగ్స్ దుర్వినియోగంపై అవగాహన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో సడెన్ చెక్సులు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని కెమిస్టులు, డ్రగ్గిస్టులు నిరంతర నియంత్రణ పర్యవేక్షణలో ఉన్నారన్నారు. గీతం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.స్వర్ణలత ఏఎంఆర్ యాంటీబయాటిక్స్ సమంజసమైన వినియోగంపై గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ మందుల అమ్మకం, ఎన్‌ఆర్‌ఎక్స్ డ్రగ్స్ అమ్మకం, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డ్రగ్స్ ఇన్స్పెక్టర్ కే ఇంద్ర భారతి అవగాహన కల్పించారు. డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు వి.అభిప్రియా (మాన్యుఫాక్చరింగ్), కున కల్యాణి (విజిలెన్స్), ఎం శ్రీనివాసరావు, విశాఖపట్నం (సేల్స్), ఎన్. కల్యాణి (నర్సీపట్నం) పాల్గొని ఫార్మసిస్టుల పాత్రలు, బాధ్యతలు, రిజిస్టర్లు, రికార్డుల నిర్వహణ వంటి పలు అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది సభ్యులు, ఫార్మసిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని శంకరం గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. సుమారు 200 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, శంకరం గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సోమవారం అసంక్రమిత వ్యాధుల కోసం మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, మానసిక వైద్య సేవలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు

గురుదేవా చారిటబుల్ ట్రస్ట్, విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పి హైస్కూల్ ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీ నరసింహమూర్తి ప్రారంభించారు. అనంతరం క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ విజయలక్ష్మి, స్త్రీల వైద్యులు డాక్టర్ జ్యోతిర్మయి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ దిలీప్, కంటి వైద్యులు డాక్టర్ కరణం చంద్రిక సుమారు 80 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పార్టీల కొమ్ముకాస్తున్న ఎన్నికల సంఘం

ప్రజాశక్తి-మునగపాక : ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల వైపు ఉండవలసిన ఎన్నికల కమిషన్ పార్టీలకు కొమ్ము కాయడం సరికాదని ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తనకాల అనంతరావు అన్నారు. మండలంలోని నాగులపల్లిలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి పార్టీలు ముందున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొలమరశెట్టి ఆదిమూర్తి, ఎంవిఆర్ రాహుల్, రావి రామసత్యం, దొడ్డి రవి, భీశెట్టి మోహన్, కాండ్రేగుల సంజీవ్ పాల్గొన్నారు.

'ఓట్ చోర్'పై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓట్ చోర్- గద్దీ ఛోడ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అనేక పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలలో అనేక విధాలుగా దొంగ ఓట్లు చేర్చారని, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వాళ్ల ఓట్లు తొలగించారని తెలిపారు. దీనిపై పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నాలుగు సార్లు సమావేశాల ద్వారా వివరించినా భారత ఎన్నికల సంఘం నుండి ఏమాత్రం స్పందన రాలేదన్నారు. దీని బట్టి ఎన్నికల సంఘం అనేక తప్పులకు నిలయంగా మారిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కాళ్ళ సత్యనారాయణ, తుట్టా రమణ, సేనాపతి రాజు, బోయిన భాను మూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

భూ రీ సర్వేలో గందరగోళం

- రైతులకు సమాచారం లేకుండానే హద్దుల నిర్ణయం
- తగాదాలకు బీజం వేస్తున్న సర్వే ప్రక్రియ
- ఆందోళన చెందుతున్న రైతులు, ప్రజలు

రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డిఓ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పరవాడ

ప్రస్తుతం జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో గందరగోళం చోటుచేసుకుంటుంది. రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వేయర్లు హద్దులు నిర్ణయంచడంతో భూ తగాదాలకు బీజం పడుతోంది. దీంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గత వైసిపి ప్రభుత్వం కాలంలో మొదలైన భూముల రీ-సర్వే కార్యక్రమం ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. ఇందులో భాగంగా మండలంలోని రావాడ పంచాయతీ పరిధిలో జరుగుతున్న సర్వే పలు అనుమానాలకు తావిస్తోంది. సర్వేలో చూపుతున్న భూమికి, రికార్డుల్లో ఉన్న భూమికి తేడా కనిపిస్తోంది. మరో వైపు రైతులకు ఇచ్చే నోటీసుల్లో భూమి వివరాలు తారుమారు కావడం, పట్టా భూముల్లో కట్టుకున్న ఇళ్లకు సంబంధించిన స్థలాల ప్రస్తావన నోటీసుల్లో లేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

రీ సర్వే అనంతరం వివాదాలు ఉన్న భూములకు సరిహద్దులు నిర్ణయించే ప్రక్రియ నిబంధనల ప్రకారం తహశీల్దారు, మండల సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో రైతులందరికీ సమాచారం ఇచ్చి చేయాల్సి ఉండగా, వాటిని పక్కనబెట్టి, గ్రామ సర్వేయర్లు ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్‌లోని లైన్ల ఆధారంగా ఇష్టానుసారంగా హద్దులు నిర్ణయిస్తున్నారు. ఫలితంగా రైతుల మధ్య సరిహద్దు వివాదాలు, రాస్తా సమస్యలు ముదురుతున్నాయి.

రైతులు చెబుతున్న దాని ప్రకారం... రావాడ సర్వే నెంబర్ 413, 412 సరిహద్దుల గుండా పూర్వం నుండి రైతులు పొలాలకు వెళ్లిరావడానికి రాస్తా ఉండగా, అది ఇప్పటికీ వినయోగంలో ఉంది. చుట్టుపక్కల ప్రాంతంలో అనేక కుటుంబాలు నివాస గృహాలు నిర్మించుకొని ఉంటున్నాయి. అయినా కూడా 413, 412 మధ్య ఉన్న ఈ రాస్తాను రీ సర్వేలో చూపించలేదు. ఈ విషయంపై ఇప్పటికే రైతులు మండల తహశీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఇలాంటి సమస్యలు కొనసాగితే రైతుల మధ్య కలహాలు ముదిరే అవకాశం ఉంది. కావునా రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, రైతులందరికీ సమాచారం ఇచ్చి వారి సమక్షంలో హద్దులను నిర్ణయించి, సబ్ డివిజన్ రూపంలో సమస్యను పరిష్కరించాలని, పూర్వం నుండి ఉన్న రాస్తాలను రీ సర్వేలో గుర్తించాలని, రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాయిశక్తి పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు విజయ్, గౌతం

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గాంధీనగర్లో ఉన్న సాయిశక్తి ప్రైవేట్ విద్యా సంస్థలో 9వ తరగతి విద్యార్థులను అతి దారుణంగా కొట్టిన ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్, సంయుక్త కార్యదర్శి గౌతం డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక కర్షక భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సంఘటనపై విద్యాశాఖ అధికారులు ఇప్పటికి స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ సంఘటనపై అధికారులు దర్యాప్తు చేసి పాఠశాల ప్రిన్సిపాల్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తునఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వెంకటలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

సాయిశక్తి స్కూల్‌ను సీజ్ చేయాలి : ఎఐఎస్ఎఫ్

అనకాపల్లి సాయిశక్తి పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి బాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై ఇప్పటివరకు విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పర్యవేక్షణకు పాతారేశారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా మొత్తం పాఠశాలలో తనిఖీలు చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలను సీజ్ చేయాలని, లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్, జిల్లా సమితి సభ్యులు అజయ్ పాల్గొన్నారు.

అనితమ్మ.. ఈ రోడ్ల సంగతి ఇంతేనేటమ్మా!

పెద్ద పెద్ద గోతులతో చెరువును తలపిస్తున్న రహదారి

ప్రజాశక్తి-కోటవురట్ల : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ ప్రధాన రహదారులన్నీ అస్తవ్యస్తంగానే దర్శనమిస్తున్నాయి, ప్రధానంగా అడ్డరోడ్డు నుంచి కోటవురట్ల వచ్చే రోడ్డుకు దాదాపు రూ.17 కోట్లు మంజూరు చేసిన నేటికీ కూడా ఎటువంటి పనులు మొదలు పెట్టక పోవడంతో ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి శంకుస్థాపన కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఆమె, దాని నిర్మాణం గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం చేపట్టిన తర్వాత మండలంలో ఒక రోడ్డు కూడా నిర్మించలేదు. కైలాస పట్నం నుండి రాజుపేట రోడ్డు పూర్తిగా చిత్రమైపోయింది. ఎండపల్లి నుండి అన్నవరం రోడ్డు, లింగాపురం నుండి వెంకటాపురం వరకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. జల్లూరు వంతెన వద్ద అసంపూర్తిగా ఉన్న అప్రోచ్ రోడ్డుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం సమీపంలో చెరువును తలపిస్తున్న రహదారి సమస్య పరిష్కారం కాలేదు. గిరిజన గ్రామాలైన కోదండరామపురం రోడ్డు, అణుకు గిరిజన గ్రామం రోడ్డు, గ్రామీణ ప్రాంతాలలో గత ప్రభుత్వంలో నిర్మించిన జగనన్న కాలనీలకు రోడ్లు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వాటి నిర్మాణానికి కూటమి నాయకులు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రత్యామ్నాయం చూపకుండా ఫుట్‌పాత్ వ్యాపారాలు తొలగింపు సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో ఫుట్‌పాత్‌లు, రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకుంటూ పొట్ట పోసుకుంటున్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా పోలీస్ బందోబస్తుతో జీవీఎంసీ అధికారులు తొలగించడం అన్యాయమని సిపిఐ జోనల్ కార్యదర్శి తాకాసి వెంకటేశ్వరరావు, వైఎన్ భద్రం, కోరుబిల్లి శంకర్రావు, శ్రీరామదాసు అబ్బులు ఆందోళన వెలిబుచ్చారు. కోడుగంటి గోవిందరావు భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన అనేకమంది ఏ పనులు దొరక్క ఆడవారితో సైతం రోడ్డు పక్కన చిన్న చిన్న దుకాణాలు పెట్టి చిల్లర సామాన్లు అమ్ముకుని కుటుంబాలు పోషించుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు వారిని అర్ధాంతరంగా తొలగిస్తే వాళ్ల కుటుంబాలు రోడ్డును పడి పస్తులతో గడపవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో హాకర్ జోన్స్ ఏర్పాటు చేసి వీధి వ్యాపారస్తులకు ఉపాధి కల్పించాలని, అంతవరకూ వారిని తొలగించరాదని కోరారు.

జీవామృతంతో చీడపీడలు దూరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానంలో జీవామృతం వినియోగం వల్ల పంటలకు చీడపీడలు దూరమవుతాయని ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ ట్రైనర్ శిరసుపల్లి అప్పలరాజు వివరించారు. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల పొలాలలో జీవామృతాన్ని తయారు చేసి చూపించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని, ఆరోగ్యానికి ఇబ్బందులు లేకుండా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మజ్జి సత్యారావు, మల్ల నాగేశ్వరరావు, ఐసిఆర్‌పిలు సంతోష్, సాయి, శ్యామల పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి : సంకల్పం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యాన ఆదివరం అయ్యప్ప గుడి వెనుక ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఇందులో పాల్గొన్న యలమంచిలి సర్కిల్ ఇనస్పెక్టర్ జనార్ధన్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో రక్తం ఎంత అవసరమో అందరికీ తెలుసునన్నారు. మాజీ ఎంపి పప్పల చలపతిరావు మాట్లాడుతూ సంకల్పం సంస్థ ఇదే రక్తదాన శిబిరంలో ప్రాణాలు రక్షించే హెల్మెట్లు కూడా ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంకల్పం ప్రతినిధులు బుజ్జి, శ్యామల, ఫౌండర్ వరప్రసాద్, జనసేన పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, ధూళి రంగనాయకులు, ఎంపిపి బోదెపు గోవిందరావు, బొద్దపు ఎర్రయ్యదొర, బెజవాడ నాగేశ్వరరావు, కొఠారు శ్రీనివాసరావు, ఉరుకూటి రమేశ్, దాడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాదిలో శ్రీకృష్ణుడి ఆలయ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు తెలిపారు. ఆదివారం ఆలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రహరీ నిర్మాణానికి అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేయించి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఆయన వెంట వార్డు సభ్యుడు దొండా నరేశ్, కమిటీ చైర్మన్ మాలిబాబు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

నర్సీపట్నంలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నక్కపల్లిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి-యంత్రాంగం

నర్సీపట్నం టౌన్: మహాకవి గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠకుడు రామచంద్రరావు, కోటవురట్ల జడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు బి.ఎస్.ప్రసాద్ మాస్టర్లు గురజాడ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులర్పించారు. ప్రసాద్ మాస్టర్ మాట్లాడుతూ, గురజాడ రచించిన కన్యాశుల్కం చిరస్థాయిగా నిలిచిందన్నారు. విశ్రాంత మండల విద్యాశాఖా ధికారి టి.అమృతకుమార్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

నక్కపల్లి: గురజాడ వెంకట అప్పారావు రచనలు సమాజ మార్పునకు ఎంతగానో దోహదపడ్డాయని తెలుగు ఉపాధ్యాయులు ఎన్ వి ఎస్ ఆచార్యులు అన్నారు. మండలంలో సీతంపాలెం గ్రామంలో గురజాడ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వకృత్వ పోటీలలో గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు గురించి విద్యార్థిని మేఘన అనర్గళంగా మాట్లాడింది. వీరికీ ఉపాధ్యాయులు ఆచార్యులు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

గాజువాక. : పాత గాజువాక జంక్షన్‌లో గురజాడ జయంతిని జెవివి ఆధ్వర్యంలో నిర్వహించారు. జెవివి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.పరశురాం, గాజువాక, పెదగంట్యాడ, స్టీల్‌ప్లాంట్, ములగాడ జెవివి అధ్యక్ష, కార్యదర్శులు పాలూరు లక్ష్మణస్వామి, ఎం. సింహాచలం, కెవి.సత్యనారాయణ, రంగనాథ్, వాసుదేవరావు, ఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా రవీంద్ర ఇండియన్ స్కూల్ విద్యార్థులు 'దేశమును ప్రేమించమన్న' నృత్యరూపకం ఆకట్టుకుంది. స్వామి విద్యానికేతన్ స్కౌట్ విద్యార్థులు కవాతు నిర్వహించారు.

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేట గ్రామంలో గురజాడ చిత్రపటానికి ఐద్వా మండల శాఖ కన్వీనర్ ఆర్ లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ కన్యాశుల్కం రచనతో సాంఘిక దురాచారాలపై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో త్రిమూర్తులమ్మ, కడారి కాసులమ్మ, ఉష, భువన, జోషిక, వర్షిత, రేవంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం : మహాకవి గురజాడ అప్పారావు జయంతిని ఎస్.రాయవరంలో గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిపి కె.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టిడిపి నాయకులు అమలకట్టి అబద్ధం, కందుల వెంకటేశ్వరరావు గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు కర్రి వెంకటేశ్వరరావు, సర్పంచ్ భూపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గురజాడ జీవితాన్ని పాఠ్యాంశంగా చేయాలి : ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహాకవి గురజాడ అప్పారావు జీవితాన్ని పాఠ్యాంశంగా చేయాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక (జెవివి) జిల్లా కమిటీ ఆధ్వర్యాన ద్వారకా బస్ క్లాంపెక్స్ జంక్షన్‌లో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంవిఎస్.శర్మ హాజరై గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ఎం.చంటి, రమణ, వైఎఆర్‌కె.ప్రసాద్, టిఆర్.అంబేద్కర్, కె.రాంబాబు, టి.అప్పారావు, ఎం.రామకృష్ణ, శేషగిరి, ఎ.చంద్రశేఖర్, పివి రమణ, ఎ.సుధాకర్, బిఎల్.నారాయణ, గంట్యాడ శ్యామల పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

వైసిపి రాష్ట్ర కమిటీల్లో పలువురికి చోటు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం నియోజక వర్గానికి చెందిన పలువురు నాయకులకు వివిధ రాష్ట్రస్థాయి విభాగాల్లో కొత్త హెూదాల్లో బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలు మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్ ప్రతిపాదనతో, పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టినట్లు సమాచారం. రాష్ట్ర మునిసిపల్ విభాగం జాయింట్ సెక్రటరీగా కోనేటి రామకృష్ణ, రాష్ట్ర మునిసిపల్ విభాగం జాయింట్ సెక్రటరీగా తమారాన అప్పలనాయుడు, రాష్ట్ర మేధావుల విభాగం జాయింట్ సెక్రటరీగా చెరుకూరి సత్యనారాయణ (వికాస్ సతీష్), రాష్ట్ర వాలంటీర్స్ విభాగం జాయింట్ సెక్రటరీగా భీమిరెడ్డి గోవింద్, రాష్ట్ర ఎస్‌సి సెల్ విభాగం సెక్రటరీగా ఈరెల్లి సుధీర్ కుమార్‌లకు బాధ్యతలు అప్పగించారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట గ్రామంలోని దుర్గామల్లేశ్వరి ఆలయంలో ఈ నెల 22 నుంచి దేవి శరన్నవ రాత్రులు ప్రారంభం కానున్నాయని ఆలయ ప్రధాన అర్చకులు కాశీభట్ల దక్షిణామూర్తిశర్మ, ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి నిత్య కుంకుమ అర్చన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నవరాత్రి మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై నిరసన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో ఆదివారం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రభావిత గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని గిరిజనులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, నవయుగ కంపెనీల దిష్టి బొమ్మలను దహనం చేశారు. హైడ్రో పవర్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ కో-కన్వీనర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏకపక్షంగా జారీ చేసిన జీఓ-51ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులను జల సమాధి చేసి కార్పొరేట్ కంపెనీలకు బలి ఇచ్చే చీకటి ఒప్పందాలను రద్దుచేయాలని పేర్కొన్నారు. గత 15న నిర్వహించిన శాంతియుత మహాధర్నాలో పాల్గొన్న నాయకులపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు శాంతియుత నిరసనలను అశాంతి పేరుతో చూపించి, నిరసనకారులపై కేసులు పెట్టడం వారి వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కృష్ణరాజు, సురేష్, జాముున, పార్వతి పాల్గొన్నారు.

బాధితుని కుటుంబానికి సరుకుల పంపిణీ

సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్తఎల్లవరం గ్రామానికి చెందిన డొంక రాంబాబు పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా సెక్రటరీ అల్లాడ సురేష్ స్పందించి ఆ కుటుంబానికి సహాయం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజాన వీరసూర్యచంద్ర చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి జనసేన పార్టీ తరపున సహాయం చేయడానికి తాము ఎప్పుడు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్ బాబు, దేవి, నాయకులు లోకారపు అప్పారావు, సఖిరెడ్డి మణిబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోయిన చిరంజీవి, లింగంపేట గ్రామ పార్టీ అధ్యక్షులు ఎం.అబ్బానాయుడు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న కెవిపిఎస్ నేతలు

అట్రాసిటీ యాక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట: ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989లో దళిత, గిరిజనుల పోరాట ఫలితంగానే వచ్చిందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అన్నారు. ఈ నెల25న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రతిష్టంగా అమలు చేయాలని విజయవాడలో జరిగే నిరసన కార్యక్రమంకు సంబంధించిన కరపత్రాలను రోలుగుంటలో ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై దాడి జరిగితే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఎస్సీ, ఎస్టీలపై దాడి జరిగినప్పుడు స్టేషన్ బెయిల్ ఇచ్చే 41ఎ నోటీసు విధానాన్ని రద్దు చేసి దాడి జరిగిన వెంటనే విచారణ పూర్తి చేయాలన్నారు. చట్టాలు గుర్తించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో ప్రదర్శన బోర్డులు పెట్టాలన్నారు. రాష్ట్ర జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీలు సమీక్షా సమావేశాలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వేగంగా మరుగుదొడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రం బిసి బాలికల వసతి గృహంలో నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ, మండల కేంద్రంలో బీసీ బాలికల వసతి గృహంలో మరుగుదొడ్ల సమస్య అధికంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమస్యను స్థానిక శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు దృష్టికి తీసుకుని వెళ్ళగా తక్షణమే స్పందించిన శాసనసభ్యులు బిసి బాలికల వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్మాణకు 30 లక్షల రూపాయలు సి ఎస్ ఆర్ నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. బాలికలకు వీలుగా ఉండే విధంగా 40 మరుగుదొడ్లు, స్నానప గదులను నిర్మించడం జరుగుతుందన్నారు.

ఎన్నాళ్లీ..రవాణా కష్టాలు

- నెల రోజుల క్రితం విజయరామరాజుపేట వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే
- మాడుగులకు నిలిచిన బస్సులు, ఇటీవల అరకొరగా రాకపోకలు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, ఉద్యోగులు

మాడుగులలో రోడ్డుపై వేచివున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-మాడుగుల: తుపాన్ కారణంగా బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద నెలరోజుల క్రితం కావేజ్ కొట్టుకు పోవడంతో మాడుగుల వచ్చేందుకు వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడ కాజ్‌వే కోట్టుకు పోవడంతో వడ్డాది మీదుగా మాడుగులకు వచ్చే బస్‌లు, వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో, చోడవరం నుంచి వచ్చే వారంతా గౌరీపట్నం మీదుగా లేదా విజయరామరాజు పేట నుంచి అప్పలరాజుపురం మీదుగా చాలా దూరం ప్రయాణం చేయవలసి వస్తోంది.

బస్సు వద్ద గుమిగూడిన జనం

విజయరామరాజుపేట వద్ద కాజ్‌వే కోట్టుకు పోవడంతో గత నెల రోజులుగా విశాఖ, అనకాపల్లి పట్టణ ప్రాంతాల నుంచి మాడుగులకు వచ్చే బస్సు సర్వీసులు నిలిపివేసి అరకొర సర్వీసులను నడుపుతున్న పరిస్థితి నెలకొంది. అనకాపల్లి. విశాఖపట్నం నుంచి నడిచే బస్సు సర్వీలను కుదించి రెండు, మూడు సర్వీసులు మాత్రమే తిప్పు తున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు వివిధ అవసరాలపై వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఉచిత బస్సుల ప్రయాణం పెట్టడంతో ఉన్న కొద్ది బస్సుల్లో రద్దీ ఏర్పడింది.బస్సులు కుదించి నప్పటికీ వచ్చే ఒక్క బస్సు కోసం గంటల తరబడి ఎదురుచూపులు చూస్తున్నారు. 18 కిలోమీటర్లు కలిగిన మాడుగుల నుండి చోడవరం ప్రయాణం విజయరామరాజుపేట మీదగా అరగంట ప్రయాణం కాగా గౌరీపట్నం మీదుగా చోడవరం 24 కిలోమీటర్ల దూరం గంటకు పైగా ప్రయాణం సాగించాల్సి వస్తుంది. గతంలో ఆటో కి 30 రూపాయలు చార్జీ కాగా ప్రస్తుతం 50 రూపాయలు తీసుకుంటున్నారు. డబ్బుతో పాటు సమయం కూడా వృధా అవుతుంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి కాజ్‌వే మరమ్మతు చేపట్టి బస్సు సర్వీసులను పూర్తిస్థాయిలో నడిపేలా చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

బల్క్ డ్రగ్ పార్కుతో జీవితాలు నాశనం

మత్స్యకారుల ఆవేదన **కొనసాగిన రిలే దీక్షలు**

నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేసి మా జీవితాలను నాశనం చేయొద్దని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 8వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. తామంతా సముద్రం పై ఆధారపడి చేపలు వేట సాగిస్తూ కుటుంబాలను పోషిస్తూ జీవనం సాగిస్తున్నామని, ఇటువంటి తరుణంలో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ బతుకులు బుగ్గిపాలు చేయొద్దన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెూం మంత్రి అనిత న్యాయం చేయాలని, బల్క్ డ్రగ్ వద్దు.. ప్రజల ప్రాణాలు ముద్దు అని ప్లకార్డులు చేత పట్టుకుని ఆందోళన చేపట్టారు. తమ ఉపాధిని, ఉనికిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే వరకూ శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, పిక్కి తాతీలు,ఎరిపిల్లి నాగేశ్వరరావు (నాగేష్), పిక్కి సోమేశ్వరరావు, పి రాంబాబు, డి.నానాజీ, సోమేష్, బి బాబ్జీ, మాధవ, కాశి, మాధవ రావు ,కాశీ, శ్రీను, రాంచరణ్, బైరాగి రాజు పాల్గొన్నారు.

కోచింగ్ క్యాంపులో క్రీడాకారులు

సాఫ్ట్‌బాల్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం ఏఎల్.పురం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లతో అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి సెలెక్ట్ అయిన జట్టు కోసం కోచింగ్ క్యాంపును టోర్నమెంట్ కమిటీ ఆధ్వర్యంలో హైస్కూల్ మైదానంలో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రంలో టోర్నమెంట్ కమిటీ ఛైర్మన్ తారక వేణుగోపాల్, స్కూల్ కమిటీ ఛైర్మన్ లగుడు రాజులనాయుడు, చిటికెల తేజ, హెచ్ఎం కె.సతీష్, పోతల శ్రీరామ్మూర్తి, పీడీలు టీవి.రమణ, నర్సింగ్, సుమన్, రవి, రాజేష్ కుమార్, చరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డుపై వేలాడుతున్న చెట్ల కొమ్మలు

ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో పురటాలమ్మ చెట్టు వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు వాలి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కొమ్మలు రోడ్డు మీదకు వాలి పోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా ట అధికారులు తక్షణమే స్పందించి వాలి పోయిన కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

రాజును సత్కరిస్తున్న నాయకులు

పిఎసిఎస్ ఛైర్మన్ మహారాజ్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని జానకిరామపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా జనసేన నాయకులు బలిజ మహారాజు ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన పార్టీ చోడవరం నియోజవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీగా జనసేన పార్టీ శ్రేణులు తరలివచ్చారు. అనంతరం పివిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సొసైటీ పాలకవర్గం పనిచేయాలన్నారు. అనంతరం పాలకవర్గాలతో సంఘం సీఈవో గణేష్ ప్రమాణం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఈర్లె శ్రీరామమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందర్ప రమణమూర్తి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె, ఆవు మృతి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం పిడుగుపాటుకు ఆర్.మల్లిబాబుకు చెందిన పాడి గేదె, ఆవు మృతి చెందాయి. దీంతో రైతు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన పైల సత్యవతి కూడా పిడుగుపాటుకు గురై గాయాల పాలు కావడంతో ఆమెను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మృతి చెందిన గేదె

ఉన్నత విద్యాభ్యాసంతో ఉపాధి అవకాశాలు

ఇండియన్ క్రికెటర్ కోన శ్రీకర్ భరత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రస్తుత సమాజంలో ఉన్నత విద్యాభ్యాసంతోనే విద్యార్థులకు అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఇండియన్ క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ అన్నారు. ఆదివారం కెటిబి కళాక్షేత్రంలో విద్య, క్రీడల్లో రాణిస్తున్న సుమారు 35 మంది విద్యార్థులకు క్రికెటర్ భరత్ చేతుల మీదుగా విద్యా ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము కోరుకున్న రంగంలో రాణించేందుకు తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఇప్పుడు క్రీడల ద్వారా కూడా అనేకమందికి ఎన్నో అవకాశాలు లభిస్తున్నట్లు చెప్పారు. డాక్ యార్డ్ ఉద్యోగులు ఒకవైపు దేశ రక్షణలో సేవలు అందిస్తూనే, మరోవైపు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. తన తండ్రి కూడా డాక్ యార్డ్ ఉద్యోగి అని తెలిపారు. అందరి ఆశీస్సులతో భవిష్యత్తులో క్రికెట్‌లో మరింతగా ఎదగాలని కోరుకుంటున్నట్లు తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

గౌరవ అతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు ఇందాల వెంకట రాజేష్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సమాజానికి తమ వంతు చేయూతను అందించడం ద్వారా పేదరికం తగ్గించవచ్చన్నారు. విద్యా ప్రోత్సహకాలు పిల్లలకు మరింత స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. డాక్ యార్డ్ కెటిబి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా అయా రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్య, క్రీడా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈసారి కూడా నీట్, ఇంజినీరింగ్‌తో పాటు పలు తరగతుల విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాలు అందించామన్నారు. క్రికెటర్ భరత్, వైద్యులు రాజేష్, సంఘం గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, జబర్దస్త్ ఫేమ్ అప్పారావు తదితరులను కార్యవర్గ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్‌యార్డ్ కెటిబి అసోసియేషన్ అధ్యక్షులు బత్తుల చిరంజీవి, కార్యదర్శి విజనగరి భాస్కరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీకర్ భరత్

బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా

చలో విజయవాడకు తరలిరండి

ప్రజాశక్తి-కె.కోటపాడు : బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనెల 24న ఛలో విజయవాడ కార్యక్రమానికి బాధిత రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని ఆర్లే, గుల్లేపల్లి, గరుగుబిల్లి, చింతపాలెం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు పర్యటించి రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ రైతుల వద్ద బలవంతంగా భూములను గుంజుకొని పర్యావరణానికి హానిచేసే కాలుష్యాన్ని వెదజల్లే కంపెనీలు పెట్టడానికి ఇస్తున్నారని తెలిపారు. గతంలో జిల్లాలో సేకరించిన భూములు ఖాళీగా ఉండగా, మళ్లీ భూ సేకరణ చేయడం దారుణమన్నారు. ఇలా సేకరించిన భూముల్లో పెట్టే కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. నిర్వాసిత కాలనీల్లో నేటికీ మౌళిక సదుపాయాలు కల్పించలేదని తెలిపారు. ఇప్పుడు ఎస్ఇజెడ్ కోసం కె.కోటపాడు మండలం ఆర్లే ప్రాంతంలోని 1200 ఎకరాలు లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని ఎక్కడా అమలు చేయడం లేదని, నిర్వాసితులకు చట్ట ప్రకారం ఎక్కడా పరిహారం, ప్యాకేజీ ఇవ్వడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, నాయకులు యర్రా దేముడు, వి.సూర్యనారాయణ, ఇర్లే నాయుడుబాబు, ఆర్ఎ పాత్రుడు, నాగ్వేశ్వరరావు, యస్.రాము, బోళం సూరిబాబు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

చలో విజయవాడ కరపత్రాలు చూపుతున్న ఆర్లి గ్రామస్తులు

నూతన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ అభినందనలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : డిఎస్‌సిలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులను కొండకర్లలో ఆదివారం యటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి సత్కరించారు. నూతనంగా ఉపాధ్యాయులు గుబ్బల విజయ్ కుమార్, ఆడారి తేజస్విని, దొడ్డి పావని, బి.బాలు శ్యామ్యూల్, మారిశెట్టి మణికుమార్ తదితరులను వారు అభినందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ ఉద్యమంలో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు యుటిఎఫ్ కట్టుబడి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులంతా సామాజిక స్పృహ, శాస్త్రీయ దృక్పథంతో రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలహీనపడితే సామాజిక న్యాయం దెబ్బతింటుందని చెప్పారు. అందుకే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం యుటిఎఫ్ ప్రథమ కర్తవ్యంగా భావిస్తుందని చెప్పారు.

నూతన ఉపాధ్యాయులను అభినందిస్తున్న యుటిఎఫ్ నేతలు

యూరియా సరిపోక రైతుల ఆందోళన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల గ్రామ రైతు సేవా కేంద్రానికి సరఫరా చేసిన 50 యూరియా బస్తాలు సరిపోవటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొండకర్ల, చీములపల్లి, ఆవ సోమవరం, ఆవరాజాం, అందాలపల్లి గ్రామాలలో వరి పంటకు అవసరమైన మేరకు యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేవలం 50 బస్తాలు మాత్రమే రైతు సేవా కేంద్రానికి వచ్చాయని తెలియడంతో రైతులు క్యూ కట్టారు. మరలా వస్తాయని ప్రస్తుతం ఒక్కొక్క రైతు ఒక్కొక్క బస్తా తీసుకువెళ్లాలని వ్యవసాయ విస్తరణ అధికారి కాండ్రేగుల భాస్కరరావు రైతులకు నచ్చజెప్పారు.